# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


ఉట్నూర్ : ఈవీఎంలు తీసుకొని వెళ్తున్న సిబ్బంది

ఉట్నూర్, నవంబర్ 29 : ఖానాపూర్ నియోజకవర్గంలో నిర్వహించే శాసనసభ ఎన్నికలకు బుధవారం రిటర్నింగ్ అధికారి జీవాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే సామగ్రిని ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి జీవాకర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, పోలింగ్ ఆఫీసర్, పోలింగేతర సిబ్బంది మొత్తం ఐదుగురు సిబ్బంది ఉంటారని, రూట్లలో ప్రత్యేకంగా సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 61 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని పేర్కొన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కావాల్సిన భద్రత కల్పిస్తున్నామని అన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కోసం పీవోలు , ఏపీవోలు, అదర్ ఓపీవోలు, మైక్రోఅబ్జర్వర్లు, బీఎల్‌వోలు, వీడియో గ్రాఫర్లు , ఫ్లైయింగ్‌స్క్వాడ్ టీంలు, ఎంసీసీ టీంలు, సరిపడ బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 305 రూట్ల ద్వారా అధికారులను పోలింగ్ కేంద్రాలను తరలించినట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. 305 పోలింగ్ కేంద్రాలకు గాను 382 బ్యాలెట్ యూనిట్లు, 382 కంట్రోల్ యూనిట్లు, 428 వీవీ ప్యాడ్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 61 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తింపునట్లు అధికారులు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు

ఇంద్రవెల్లి, నవంబర్ 29 : మండలంలోని 42 పోలింగ్ కేంద్రాలకు రాత్రి అధికారులు ఈవీఎంలతో ప్రత్యేక బలగాలతో పాటు పోలీస్ బందోబస్తు మధ్య చేరుకున్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు ఈవీఎంలతో పాటు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేశారు.


ఉట్నూర్ : సిబ్బంది వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు


ఇంద్రవెల్లి : పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో చేరుకున్న అధికారులు

# ఓటరు చూపు... ప్రగతి వైపు

- అభివృద్ధి పథంలో ఆదిలాబాద్ నియోజకవర్గం
- రూ. 5250 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- అగ్రికల్చర్, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలు
- ఐటీ టవర్‌తో యువతకు ఉపాధి


ఆదిలాబాద్ నిర్మించిన జ్యోతిబాపూలే జూనియర్ కళాశాల

ఆదిలాబాద్, నవంబరు 29 ( నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పథంలో ధూసుకుపోతుంది. సాగు, తాగు నీరు, విద్య, వైద్యం, రవాణా, కులవృత్తులకు చేయూతనందించడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం తొమ్మిదిన్నర ఏండ్లలో గణనీయమైన ప్రగతి సాధించింది. రూ. 5, 250 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ఫలితంగా ప్రజలు జీవణప్రమాణాలు మెరుగుపడ్డాయి.

## సాగునీటి రంగానికి పెద్దపీట

ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడేవారు. మహారాష్ట్ర సరిహద్దులో జైనథ్ మండలంం కొరాట వద్ద ప్రభుత్వం రూ.1227 కోట్లతో చనాక, కొరాట ప్రాజెక్టును నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో 51 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. నియోజకవర్గంలో నిర్మించిన మిషన్ కాకతీయలో భాగంగా నిర్మించిన చెరువుల ఫలితంగా రైతులు రెండు పంటలు సాగు చేస్తున్నారు. చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భజల నీటమట్టం గణనీయంగా పెరిగింది.

## ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తో పాటు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందన్నాయి. ఆరోగ్య సమస్యలతో వచ్చేవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి ప్రభుత్వ టీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసి 57 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. రూ.150 కోట్లతో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మించారు. కార్డియాలజీ, న్యూరో, యూరాలజీ, సర్జికల్ అంకాజి, పీడీయాట్రిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. పేదలకు ఉచితంగా కీళ్లమార్పిడి చికిత్సలు చేస్తున్నారు. రూ.1.56కోట్లతో బేల పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా, రూ.20లక్షల చొప్పున ఆరు సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ.1.20కోట్ల మంజూరయ్యాయి.

## విద్యారంగంలో ప్రగతి

నియోజకవర్గంలో విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి ప్రభుత్వం అగ్రికల్చర్, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేసింది. మన ఊరు– మన బడి, మన బస్తీ– మన బడి కార్యక్రమం ద్వారా మొదటి విడుతలో రూ.20కోట్ల నిధులు ఆదిలాబాద్ నియోజకవర్గంలో 78 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మంజూరు చేశారు. పేద విద్యార్థులకు ఇంగ్లిషు మీడియం చదువులు అందించడానికి బేలలో బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభించారు.

## మెరుగైన రవాణా సౌకర్యం

నియోజకవర్గంలో రూ. వేయి కోట్లతో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చడానికి వెచ్చించారు. రూ.45కోట్లతో ఆదిలాబాద్ నుంచి బేల వరకు రెండు వరుసల రహదారి నిర్మించారు. ఆదిలాబాద్‌లో రూ.63.29 కోట్లు రోడ్ల విస్తరణ పనుల, సీసీ రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం కేటాయించారు. రూ.10 కోట్లతో ఆదిలాబాద్ నుంచి కెరమెరి రోడ్డు రహదారిపై మూడు వంతెనలు నిర్మించారు. జామిని నుంచి పెన్ గంగ రోడ్డును వెడల్పు చేయడానికి రూ.10కోట్లు కేటాయించారు. బేల, ఆదిలాబాద్ పట్టణంలో రోడ్ల మరమ్మతులు, వెడల్పు కోసం రూ.4.30కోట్లు మంజూరు చేశారు. పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి , అండర్ బ్రిడ్జిల కోసం రూ.87.20కోట్లతో పనులు సాగుతున్నాయి.

## యువతకు ఉపాధి

నియోజకవర్గంలోని యువత ఉపాధి కల్పనకు జిల్లాలో రెండు ఐటీ కంపెనీలు ఉండగా 230 మందిఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వం రూ.40 కోట్లతో మూడు ఎకరాల్లో ఐటీ టవర్‌ను ప్రభుత్వం నిర్మిస్తుంది. టవర్ నిర్మాణంతో ప్రత్యేక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

❖❖ఆదిలాబాద్ నియోజకవర్గంలోని 11,971 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు.

❖ దళితబస్తీలో భాగంగా 864 వ్యవసాయ ఆధారిత దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి మూడు ఎకరాల చొప్పున 2229 భూమిని పంపిణీ చేసింది. ఇందు కోసం రూ. 97 కోట్లు ఖర్చు చేసింది.

❖ దళిత బంధు పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 100 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10లక్షల చొప్పున రూ.10 కోట్లను ప్రభుత్వం అందజేసింది.

❖ ఆదిలాబాద్ నియోజకవర్గంలో 27,430 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.5.80 కోట్లు మంజూరు చేస్తుంది.

### యువత ఉపాధి కోసం ప్రత్యేక ప్యాకేజీ

ఆదిలాబాద్ నియోజకవర్గంలో తొమ్మిదిన్నర ఏండ్లలో రూ. 5250 కోట్లు వ్యయం చేయడం జరిగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించింది. పట్టణాలకు పరిమితమైన ఐటీ రంగం ఇప్పుడు ఆదిలాబాద్‌కు విస్తరించింది. ప్రభుత్వం రూ.40 కోట్లతో ఐటీ టవర్ నిర్మిస్తుంది. గతంలో ఎన్నడూ చేపట్టని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగింది. వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, మహిళా సంక్షేమ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, కులవృత్తులకు చేయూత అందిస్తుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి కల్పంచడానికి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.

-జోగు రామన్న, ఎమ్మెల్యే, ఆదిలాబాద్


చనాక- కొరాట ప్రాజెక్టు ట్రయల్ రన్


ఆదిలాబాద్- బేల వరకు నిర్మించిన రోడ్డు